క్లుప్తంగా

బస్తీ దవాఖానా కోసం భవనం పరిశీలన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో మరో బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం మంగళవారం ఆజాంగంజ్, బ్రహ్మణ్ గల్లీ ప్రాంతాల్లో భవనాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు.ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వసతులు ఉన్న చోట బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామన్నారు.ఈవిషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఉపవైద్యాధికారి సమతకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

రుద్రూర్: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని కోటగిరి ఎస్సై సునీల్ సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను సేవించిన పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచామని ఎస్ఐ తెలిపారు.

గోడౌన్ నిర్మించాలని రైతుల ధర్నా



రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి సొసైటీ ఎదుట సంఘ పరిధిలోని లింగాపూర్ రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. లింగాపూర్ లో గోడౌన్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈవిషయమై సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన అమలు చేయడంలో పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ సర్పంచ్ హనుమంతు ఆరోపించారు.గోడౌన్ నిర్మాణానికి అనువైన స్థలం ఉన్నప్పటికీ నిర్మాణం చేపట్టడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఆందోళనలో కొండారెడ్డి, శంకర్, రవి, బాలరాజు, అనిల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని అప్పగించాలి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని వెంటనే పాఠశాల యజమాన్యానికి అప్పగించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం పాఠశాల నూతన భవనం ను పరిశీలించారు. పాఠశాల భవనంలో చేపట్టవలిసిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో మొయినొద్దీన్, ఎంఈవో జక్కుల రవికుమార్, ఎస్‌వో వినోద తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌కు చెందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ముగ్గురు బాధితులకు రూ. 69 వేలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ కపిల్, నాయకులు గంగాధర్, నగేష్, రవీందర్, హనుమంతు, ప్రసాద్, పురుషోత్తం తదితరులున్నారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

డొంకేశ్వర్(ఆర్మూర్): యువజన గౌడ సంఘం డొంకేశ్వర్ మండల కమిటీ ఎన్నికైంది. మంగళవారం జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మహేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఉపాధ్యక్షులుగా రంజిత్‌గౌడ్, కోశాధికారిగా మహేశ్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీగా నవదీప్‌లను ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీని గౌడసంఘం అధ్యక్ష,కార్యదర్శులు నారాగౌడ్, సుదర్శన్‌గౌడ్, తదితరులు సన్మానించారు.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

- అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు
- రెంజల్ మండలంలో రోడ్ల పక్కనే చెత్తాచెదారం



మౌలాలితండాలో రోడ్డు పక్కన చెత్త నిల్వలు



రెంజల్‌లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు

రెంజల్(బోధన్): గ్రామాలను స్వచ్ఛ నిలయాలుగా మార్చేందుకు ప్రభుత్వం ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డును రూ.12 లక్షల వ్యయంతో ప్రతి గ్రామంలో నిర్మించింది. రెంజల్ మండలంలో 17 జీపీలున్నాయి. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా తయారయ్యాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి దాని ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చనే లక్ష్యంతో వీటిని నిర్మించారు. ఆరంభంలో కొంత మేరకు సర్పంచ్‌లు, అధికారులు ప్రయత్నించినా కాలక్రమేణా వీటి నిర్వహణ గాడితప్పింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీల్లో సేకరించిన చెత్తను వేరు చేయడమే మానేశారు. కొన్ని పంచాయతీల్లో సేకరించిన చెత్తను రోడ్ల పక్కన పోసి కాల్చేస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో కుప్పలుగా పోసి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు విక్రయిస్తే పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం మెరుగుపడుతుందని చేపట్టిన ప్రభుత్వ బృహత్ ప్రణాళిక పాలకుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది.

వినియోగంలోకి తీసుకురావాలి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లు, ట్యాంకర్లు మంజూరు అయ్యా యి. తడి, పొడి చెత్తబుట్టలను ఇంటింటికి అందించారు. అధికారుల నిర్లక్ష్యంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. అధికారులు వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలి. – తిరుపతి బుజ్జి, రెంజల్

కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం

సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకరావాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలో వినియోగంలోకి తీసుక వచ్చేందుకు ప్రయత్నిస్తాం. గైడ్‌లైన్ పాటించాలని కార్యదర్శులకు ఇటీవల జరిగిన సమావేశంలో వివరించాం. – రఫియోద్దిన్, ఎంపీవో

నేటి చిత్రం



ప్రమాదకరంగా గుంతలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం నుంచి మెండోరా మండల కేంద్రం వరకు ఉన్న బీటీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను వెంటనే పూడ్చివేయాలి. – శ్రీనివాస్, మెండోరా

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ఆయిల్ పామ్ సాగుతో నిరంతర ఆదాయం



మంథనిలో మాట్లాడుతున్న ఏడీఏ విజయలక్ష్మి

పెర్కిట్(ఆర్మూర్): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని ఏడీఏ విజయలక్ష్మి అన్నారు. ఒక్కసారి నాటితే నాలుగో ఏడాది నుంచి ఆదాయ ప్రారంభమవుతుందన్నారు. ఆర్మూర్ మండలం పిప్రి, మంథని గ్రామాల్లో రైతులకు మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎన్ఎంఈవో వోపీ స్కీం క్రింద రాయితీలు లభించనున్నట్లు తెలిపారు. ఎకరాకు అవసరమయ్యే వేయి మొక్కలకు డీడీ చెల్లిస్తే 90 శాతం రాయితీతో మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తే సంవత్సరానికి రూ.4,200 రైతుల ఖాతాల్లో జమా చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. అలాగే ఐదు ఎకరాలపై ఉన్నవారు 80 శాతం రాయితీ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో హరి కృష్ణ, హార్టికల్చర్ ఏవో రాజు, పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, క్లస్టర్ అధికారి నిష్కాంత్, ప్రీ యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎడపల్లిలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

బోధన్: ఎడపల్లిలోని సరయూ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయిల్‌పామ్ సాగు విధానం, మార్కెటింగ్, లాభాలు అంశాలపై ప్రీయూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ అధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి హాజరు కానున్నారు.

ఎకో టూరిజం స్థలం పరిశీలన



ఎకో టూరిజం ప్రాంతాన్ని నాయకులతో కలిసి పరిశీలిస్తున్న వినయ్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని చిన్నయానం వద్ద ఎకో టూరిజం ప్రాంతాన్ని మంగళవారం ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పి. వినయ్‌రెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం త్వరలో ఎకో టూరిజం పనులు ప్రారంభిస్తుందని తెలిపారు. అనంతరం అక్కడే ఉమ్మడి మండలాల నాయకులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లిఫ్టుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నాయకులు వినయ్‌రెడ్డిని కోరారు. అలాగే డొంకేశ్వర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండల కేంద్రంలో చేపల మార్కెట్ షెడ్డు, గంగపుత్ర ఆలయాన్ని నిర్మించాలని మత్స్యకారులు వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందులో ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమేశ్ రెడ్డి, మహిపాల్, ఇతర నాయకులున్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను వినయ్‌రెడ్డి, ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

రూ. లక్ష విరాళం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ శివారు నిజామాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని వినయ్ రెడ్డి సందర్శించారు. ఆలయ నిర్మాణానికి ఆయన రూ. లక్ష విరాళంగా అందజేశారు. కుల పెద్దలు వినయ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ సాయిబాబాగౌడ్, నాయకులు బారడ్ రమేష్, ఖాందేష్‌శ్రీనివాస్, ప్రసాద్, నర్సారెడ్డి, సంఘం అధ్యక్షుడు బోండ్ల సంతోష్, గంగాధర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కబ్జా కాకుండా చూడాలి

రుద్రూర్ : మండలంలోని అక్బర్ నగర్‌లో మైనారిటీల శ్మశాన వాటిక కబ్జాకు గురవుతుందని స్థానిక మజీద్ కమిటీ సభ్యులు మంగళవారం తహసీల్దార్ సురేందర్ నాయక్ కు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకొని తిరిగి శ్మశానవాటికకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మజీద్ సదర్ షేక్ మొహమ్మద్, షేక్ ఫహీం, షేక్ అన్వర్ జావీద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణ

- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న అధికారులు
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సంయుక్త సర్వే చేసి హద్దుల ఏర్పాటు
- స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి



మామిడిపల్లి వద్ద ఇరిగేషన్ స్థలంలో నిర్మించిన భవనాలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ శివారు నుంచి పెర్కిట్ వరకు 82/2/1 నిజాంసాగర్ కాలువ వెంట అక్రమ నిర్మాణాలు జరిగాయి. గతేడాది ఉన్నతాధికారుల ఒత్తిడితో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సంయుక్తంగా మామిడిపల్లి నుంచి పెర్కిట్ వరకు ఉన్న నిజాం సాగర్ కాలువ వెంట సర్వే చేపట్టి అక్రమ నిర్మాణాల గోడలపై హద్దులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు అన్యాక్రాంతమైన స్థలాలను స్వాధీనం చేసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొటార్మూర్ 63వ నంబరు జాతీయ రహదారి పక్కన 40/1 సర్వే నంబరులో ఆక్రమణకు గురైన 38 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో దూకుడుగా వ్యవహరించారు. అలాగే మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలో సర్వే చేసి గుర్తించిన ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్టణవాసులను విస్మయానికి గురి చేస్తోంది. అలాగే ఇరిగేషన్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులిస్తూ మున్సిపల్ శాఖ అక్రమార్కులకు దన్నుగా నిలుస్తోందనే ఆరోపణలున్నాయి. మామిడిపల్లి నుంచి పెర్కిట్ వరకు ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురి కావడంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు అంతరాయం కలగడమే కాకుండా వర్షకాలంలో వాన నీటి ప్రవాహానికి, అలాగే మురికి నీటి ప్రవాహానికి దారులు మూసుకుపోయాయి. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణ నిర్మాణాలపై కొరడా ఝులిపించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ ఇంటి నంబర్లను రద్దు చేశాం



నేను పదవీ బాధ్యతలు చేపట్టడానికి ముందు కేటాయించిన అక్రమ ఇంటి నెంబర్లను రద్దు చేస్తున్నా. ఇప్పటి వరకు 140కిపైగా అక్రమ ఇంటి నంబర్లను రద్దు చేశాం. ఇంటి నిర్మాణానికి అన్ని దస్తావేజులు సక్రమంగా ఉంటేనే అనుమతులు ఇస్తున్నాం.
– రాజు, మున్సిపల్ కమిషనర్

వినతిపత్రం అందజేత

మాక్లూర్: ఇంటి స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన నిరుపేదలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శేఖర్‌కు వినతి పత్రం అందించారు.నాయకులు జి శ్రీనివాస్, టి వంశీ, అరుణ, రుణుక, స్వప్న, రాములు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట : బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని పార్టీ సమన్వయ కమిటీ అధ్యక్షులు న్యాలకంటి అబ్బన్న సూచించారు. మండలంలోని హనుమాన్ ఫారం గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్ కుమార్, అల్లం రమేష్, సూరిబాబు, లోకం నర్సయ్య, తాహేర్ జాఫర్, అల్తాఫ్ ఉద్దీన్, రవీందర్ రెడ్డి, పోసాని, గౌరు పల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా పండుగ



ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాక్లూర్: మండలంలోని అమ్రాద్‌తండా, కల్లెడి ల్లో మంగళవారం గిరిజన ప్రజలు శీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జగదాంబా దేవత మూర్తులను గిరిజన యువతులు తలపై పెట్టుకొని గ్రామ శివారులో చెట్టు వద్దకు గిరిజన సంప్రదాయ బద్దంగా తరలివెళ్లారు. అనంతరం గిరిజన సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆట పాటలతో సందడిగా గడిపారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. బాధితులైన సాయిచరణ్, సాజిదబేగం, చింతల నవ్యలకు ఫోన్లను తిరిగి అందజేశారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

పరిసరాల్లో నీరునిలువ లేకుండా చూడాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటిని నిలువ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 2వ, 15వ వార్డులో ఘన వ్యర్థా పదార్థాల నిర్వహణపై అవగాహన నిర్వహించారు. పట్టణంలోని అరుందతినగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేషన్‌పై హెల్త్‌సూపర్‌వైజర్ శాంత అవగాహన కల్పించారు.. శానిటరీ ఎస్సై సురేష్, పర్యావరణ ఇంజినీర్ పూరణమౌళి, జవాన్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బాల్కొండ: హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కిసాన్‌నగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ స్రవంతి అన్నారు. మండల కేంద్రంలో బీసీ బాలికల హాస్టల్‌ను వంట గదిని, మూత్రశాలలను పరిశీలించారు. హెల్త్ సూపర్ వైజర్ వేణుగోపాల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థి వసతి గృహం తనిఖీ చేసిన కమిషనర్

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తనిఖీ చేశారు. నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రంను బాగు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. కూరగాయలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్, వార్డు అధికారి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ గంగాధర్

రోడ్లను కమ్మేస్తున్న చెట్ల పొదలు



నందిపేట బైపాస్ రోడ్డులో చెట్ల కొమ్మలు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బైపాస్ రోడ్డు తో పాటు చింరాజ్‌పల్లి-లక్కంపల్లి-తల్వేద రోడ్డు పొడవునా, అలాగే నందిపేట నుండి ఆర్మూర్ వెళ్లే రోడ్డు, నందిపేట నుండి వెల్మల్ రోడ్డు గుండా, నందిపేట నుంచి అయిలాపూర్ వెళ్లే రోడ్డు పొడవునా బీటీ రోడ్ల వెంట చెట్లు, ఇతర పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు చెట్ల చాటున కనపడక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు మధ్యలో గుంత.. ప్రయాణానికి చింత



నందిపేటలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పాతూర్ వాటర్ ట్యాంకు వద్ద గల రోడ్డు మధ్యలో గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నడిరోడ్డుపై గుంత పెద్దదిగా ఉండటంతో వాహనాలు అందులో పడిపోతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగకుండా కాలనీ వాసులు గుంత చుట్టూ పక్కల పెద్ద పెద్ద బండరాళ్లు ఉంచారు. అలాగే ప్రమాదసూచికగా ఎర్రని గుడ్డను జెండాగా కట్టారు. గుంత ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బోనాల పండుగ

రుద్రూర్: పోతంగల్ మండలంలోని హంగర్గ, పోతంగల్ గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు.వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు, వివిధ కుల సంఘాల సభ్యులు మహిళలు తదితరులున్నారు.



పోతంగల్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

బోధన్‌లో..



బోధన్‌లో ..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆజాంగంజ్, చెక్కికాంప్ కాలనీల్లో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి మహిళలు ఊరేగింపుగా వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. సబ్‌కలెక్టర్ వికాస్ మహతో ప్రత్యేక పూజలు చేశారు.

కబ్జా చేసిన భూమిని తిరిగి ఇప్పించాలి

ఆర్మూర్‌టౌన్: డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమ భూమిని అక్రమంగా కబ్జా చేశాడని బాధితుడు గంపల కల్యాణ్ ఆరోపించారు.ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 60 ఏళ్లుగా తమ వ్యవసాయ భూమిలో తామే కబ్జాలో ఉన్నామన్నారు. సర్వే నంబర్ 1129లో 30 గుంటలు అక్రమంగా పట్టా చేసుకున్నాడని, అలాగే 1131 సర్వే నంబర్‌లో అసైన్‌మెంట్ భూమి 28గుంటలు తన పేరుమీదు చేసుకున్నాడని,భయందోళనకు గురిచేస్తున్నాడని ఆరోపించారు.

అక్లూర్‌లో ఇళ్ల స్థలాల వివాదం

వేల్పూర్: మండలంలోని అక్లూర్ గ్రామంలో 414,415,416 సర్వే నంబర్లలోని భూమిపై వివాదం రాజుకుంది. ఈ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ తమకు 1994లో పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారని బలహీనవర్గాలు, తమకు ఆ భూమి వారసత్వంగా వస్తోందని, ధరణిలో కూడా పొందుపరచారని పట్టాదారులు పేర్కొంటున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై సంజీవ్ మంగళవారం అక్లూర్‌కు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్య కావడంతో తహసీల్దార్ శ్రీనివాస్‌కు రాతపూర్వకంగా విన్నవించారు.